క్లుప్తంగా

మెరుగుపడిన పారిశుద్ధ్యం


కాలువలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నగరి : మండలంలోని ఓజీ కుప్పంలో పారిశుద్ధ్య సమస్యను ప్రస్తావిస్తూ 'చలితో గజగజ.. జ్వరాలతో విలవిల' శీర్షికతో ప్రచురించిన సాక్షి జిల్లా కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయాన్నే ఎంపీడీఓ సతీష్ ఆదేశాల మేరకు సర్పంచ్ మోహన్ ఆధ్వర్యంలో ఓజీ కుప్పం చేరుకున్న అధికారులు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి ఎక్కడా నీరు నిలవకుండా ముందుకు పోయే ఏర్పాటు చేశారు. రహదారి పక్కనే ఉన్న చెత్త కుప్పలను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచారు. సమస్యను ప్రచురించి పరిష్కరించిన 'సాక్షి'కి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.


చెత్త కుప్పలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

అసంబద్ధంగా 100 రోజుల ప్రణాళిక

నగరి : పదో తరగతి పరీక్షల కోసం పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అసంబద్ధంగా ఉందని అందులో మార్పులు చేయాలని జిల్లా హిందీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం, ఆదివారం వంటి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించాలని చెప్పడం విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచుతుందన్నారు. సంక్రాంతి సెలవులను మూడు రోజులకు కుదించడం తగదన్నారు. ఈ ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా, ఆసక్తిగా చదవగలిగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వీటిన్నింటిని పరిగణలోకి తీసుకొని ప్రణాళికలో మార్పులు చేయాలన్నారు.

విద్యుత్ పొదుపు ఎంతో అవసరం


ఎస్ఈని సన్మానిస్తున్న విద్యుత్ అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం) : విద్యుత్ వాడకంలో ప్రతి ఒక్కరూ పొదుపును పాటించి రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని విద్యుత్ ఎస్ఈ ఇస్మాయిల్ అన్నారు. శుక్రవారం పెనుమూరు విద్యుత్ కార్యాలయాన్ని సందర్శించి, సబ్‌స్టేషన్‌ను పరిశీలిచారు. రైతులకు మెరుగైన విద్యుత్‌ను అందించడానికి అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు సురేష్ కుమార్, జగదీష్, ఏడీఈ శేషాద్రి, ఏఈ తులసీ ప్రసాద్ పాల్గొన్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సు

పాలసముద్రం : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా మారాయి. శుక్రవారం అల్లిపుల గుంట గ్రామంలో తహసీల్దార్ అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రెండు అర్జీలు మాత్రమే వచ్చాయి. సదస్సుకు వచ్చిన రైతులతోనే మొక్కుబడిగా సభ నిర్వహించి మమ అనిపించారు. కార్యక్రమంలో ఏఆర్ఐ దేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పు.. లాభాల కూర్పు


పంట మార్పిడి పద్ధతిలో కూరగాయల సాగు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏటా ఒకే రకమైన వరి, వేరుశనగ పంటలు సాగు చేయడం వలన భూములు నిస్సారంగా మారి ఆశించిన దిగుబడులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంట మార్పిడితో పంటల దిగుబడి పెరిగి భూమి సారవంతమవుతుందని చెబుతున్నారు.

- రసాయనిక ఎరువుల ఖర్చు తగ్గుదల
- తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షణ
- అధిక దిగుబడులతో ఆదాయం

నింద్ర: ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి నిస్సారంగా మారి తెగుళ్ల, చీడ పీడల సమస్య ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పంట మార్పిడిలో నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వలన పంటలో కలుపు మొక్కలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. అలాగే భూమిలో ఉండే చీడ పీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు సగానికి తగ్గుతుంది.

భూమి సారవంతం

ఏటా ఒకే రకమైన వరి, వేరుసెనగ పంటలు సాగు చేయడం వలన కొన్ని రకాల పురుగులు, తెగుళ్ల పంటను ఆశించడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఈ క్రమంలో ఏటా సాగు చేసే పంటలు కాకుండా మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరుసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, నువ్వులు వంటి పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుము, వేరుసెనగ వంటి పంటలకు లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్ట పరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, రాగులు వంటి ఆరుతడి పంటలతో మార్పు చేస్తే మంచిదని చెబుతున్నారు. పత్తి వేసిన పొలంలో మిరప సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుంది. వరి వేసే పొలానికి ముందుగా జనుము వేస్తే సేంద్రియ ఎరువుగా తయారై పంట మంచి దిగుబడి వస్తుంది. అలాగే ఏటా వేసే పంటలు మార్పిడి చేయడం రైతులకు ఎంతో శ్రేయస్కరం.


సాగులో జనుము పంట

మార్కెట్‌లో డిమాండు ఉన్న పంటలు



పంటల మార్పిడితో రైతులకు దిగుబడి పెరుగుతుంది. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉద్దులు, పెసర, రాగులు సాగు చేస్తే భూమి సారవంతం అవుతుంది. అలాగే భూమిలో జనుము వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారువుతుంది. దీని వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రాగులు, ఉద్దులు, పెసర, సజ్జ వంటి పంటలు సాగు చేసుకొంటే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది.

– తులసీరాం, మండల వ్యవసాయాధికారి, నింద్ర

ప్రకృతి వ్యవసాయం

రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రైతులకు ఖర్చు తగ్గడమే కాకుండా ఎరువుల వాడకం తగ్గించడం జరుగుతుంది. దిగుబడి నాణ్యంగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించి పంట సాగు విధానంపై ఆసక్తి కల్పిస్తున్నారు. నాలుగేళ్లుగా నింద్ర మండలంలోని ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు.

హైవే నిర్మాణంలో పాత కొలతలే ప్రామాణికం

నగరి : హైవే నిర్మాణంలో పాత కొలతలనే ప్రామాణికంగా తీసుకోవాలని తడుకుపేట, వీకేఆర్‌పురం గ్రామాలకు చెందిన బాధిత రైతులు ఆర్డీఓ భవానీశంకరికి వినతిపత్రం అందజేశారు. 2008–09 సంవత్సరంలోనే జాతీయ రహదారి 205 రోడ్డు 60 మీటర్ల వెడల్పుతో నిర్మాణానికి కొలతలు తీశారని ఆ మేరకు మా భూములు వదులుకొని మిగిలిన పొలాలను సాగు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. ఆ భూములే మా జీవనాధారమన్నారు. నాడు తీసిన కొలతల ప్రకారం రోడ్డు వేయని అధికారులు నేడు రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆ కొలతలు వదలి కొత్త కొలతలు తీస్తున్నారన్నారు. ఆ కొలతల ప్రకారం రోడ్డు వేస్తే చిన్న, సన్నకారు రైతులు జీవనాధారాన్ని కోల్పోతామన్నారు. అలాగే పట్టా భూముల్లో టోల్ ప్లాజాను ఏర్పాటు చేయక తడుకుపేట వద్ద ఉన్న ప్రభుత్వ భూముల్లోనే టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ 205 బాధిత రైతులు పాల్గొన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన


నగరి : నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నేతలు

నగరి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణ పరిధి బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జైభీమ్ సేన, కాంగ్రెస్ పార్టీ, బీఎస్పీ, సీపీఐ, ఏపీఎల్ఎఫ్, బహుజన ఆటో యూనియన్ వర్కర్స్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ బాబు, జైభీమ్ సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పవర్ రామచంద్రన్ మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు వేలన్, సబీర్ భాష, చంద్రయ్య, రాజేష్, శ్రీనివాసులు, విజయ్, శేఖర్, బాబు, జేమ్స్, ఉమాపతి, మారన్, ప్రతాప్, ముకుందం, బాబు ముదిరాజ్, వెంకటేష్, అపున్, బాల మహేష్, వై. నాగూర్ పాల్గొన్నారు.

దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

విజయపురం : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేసి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘ మండల అధ్యక్షుడు పూడి జయంత్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

విభిన్న ప్రతిభావంతుల వైద్య శిబిరానికి స్పందన


మోకాళ్లపై నడిచి వస్తున్న దివ్యాంగుడు

నగరి : విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ పరికరాలు అందించేందుకు పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక గుర్తింపు శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం స్థానిక పీసీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని జిల్లా ఉద్యాన శాఖ ఉప సంచాలకులు మధుసూదన్ రెడ్డి, నగరి ఆర్డీఓ భవాని శంకరిలతో కలసి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్ ప్రారంభించారు. 586 మంది ఈ శిబిరంలో పరీక్షలకు హాజరు కాగా సహాయ పరికరాలు అందించేందుకు 442 మంది అర్హత పొందినట్లు తెలిపారు. అవసరమైన వారికి చేతి కర్రలు, వాకర్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, మూడు చక్రాల సైకిళ్లు , రోలేటర్స్, యంఎస్.కిట్స్, అంధులకు చేతి వాచ్, చేతి కర్రలు, టచ్ ఫోన్, వాయిస్ ఫోన్, తదితర కృత్రిమ అవయవ పరికరాలు అవసరమని గుర్తించడం జరిగిందన్నారు. వారికి మూడు నెలల్లో ఈ సహాయ పరికరాలను అందిస్తామన్నారు. శిబిరం ప్రారంభోత్సవంలో తహశీల్దార్ రవిశేఖర్, సీఐ మహేశ్వర్, ఎంపీడీఓ సతీష్, సచివాలయ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.



శిబిరానికి వచ్చిన వారిని పరీక్షిస్తున్న అధికారులు, హాజరైన దివ్యాంగులు, వృద్ధులు

నాణ్యమైన భోజనం పెట్టాలి

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం బలికంద్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో త్వరగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం రఘు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పాలసముద్రం : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ ఆవరణంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మండల విస్తరణాధికారి రమేష్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల డయేరియా బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు.

ఉద్యోగమేళాలో 22 మంది ఎంపిక


ఎంపికైన అభ్యర్థులతో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రాజేష్

కార్వేటినగరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన కార్యాలయం, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగమేళాలో 22 మంది ఎంపిక అయినట్లు ఐటీఐ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఆర్.రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటీఐ కళాశాల ఆవరణలో జరిగిన ఉద్యోగమేళాలలో మాట్లాడుతూ.. ఇంటర్వ్యూకు పదో తరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు హాజరయ్యారని పేర్కొన్నారు. అనంతరం కంపెనీ యాజమాన్యం వారికి ఆర్డర్ కాపీలను అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, నైపుణ్యాభివృద్ధి కో ఆర్డినేటర్ అబ్దుల్ ఆజేష్, డీపీఓ లోకేష్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ

శ్రీరంగరాజపురం : రైతులు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నెలవాయి సచివాలయంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ ఇచ్చారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఆయిల్ పామ్‌తోనే సాధ్యమన్నారు. అయిల్ పామ్ మొక్క మార్కెట్‌లో రూ.193 ఉంటే ప్రభుత్వం రాయితీతో అందిస్తోందన్నారు. కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి నర్మద, మండల ఉద్యాన అధికారి డిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధ ఆధునిక గణిత శాస్త్రవేత్తల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరన్నారు. గణిత శాస్త్రం ప్రాముఖ్యం, ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం గణిత విభాగాధిపతి రుష్మ మాట్లాడుతూ.. భారతీయ దిగ్గజ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర, ఆయన చేసిన పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్నలత, అధ్యాపకులు శంకర్‌రెడ్డి, అరుణ, మున్వర్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, మంగళగౌరి, నరేంద్రబాబు, లావణ్యకుమారి పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ సంబరాలు


కానుకలు అందుకొన్న మహిళలతో అధికారులు

పుత్తూరు : క్రిస్మస్‌ను పురస్కరించుకొని స్థానిక రాస్ సంస్థ పేదలకు కానుకలను పంపిణీ చేసింది. స్థానిక సెయింట్ జాన్ లూథరన్ చర్చిలో శుక్రవారం రాస్ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రజేంద్రన్ మాట్లాడుతూ.. రాస్ సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళా సంఘం సభ్యులతో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పేద వృద్ధ మహిళలకు చీరలు, దుప్పట్లు, చేతి కర్రలు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ హృదయారంజన్, రాస్ అధికారి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విందు భోజనాలు

నగరి : మున్సిపల్ పరిధి నెత్తం కండ్రిగ దళితవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి కమిటీ మాజీ డైరెక్టర్ కృష్ణమూర్తి పాఠశాల విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. క్రిసమస్ కేక్‌ను కట్ చేసి అందించారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

గంగాధర నెల్లూరు : ముందస్తు క్రిస్మస్ వేడుకలను గంగాధర నెల్లూరులో మాజీ జెడ్పీటీసీ సతీమణి సెల్వరాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున మహిళలకు చీరలు పంపిణీ చేసి భోజనం ఏర్పాట్లు చేశారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

పాలసముద్రం : జీవామృతం వినియోగంతో చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగ ఎల్‌సీఆర్‌పీ ప్రతాప్ తెలిపారు. సీఎం కండ్రిగలో శుక్రవారం జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. 100 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి 5 లీటర్ల గోమూత్రం, 5 కిలోల దేశీ ఆవు పేడ, ఒక కిలో బెల్లం, శనగ పిండి, పిడికెడు పుట్టమన్ను, 100 లీటర్ల నీటిలో కలిపి 5 రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలపాలని సూచించారు. అనంతరం దాన్ని వడగట్టి వచ్చిన ద్రావణాన్ని జీవామృతంగా వినియోగించుకోవచ్చన్నారు. దీన్ని మొక్కలకు వేస్తే ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. సీఎం కండ్రిగలో నిర్మల రైతు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి జీవామృతాన్ని సాగులో ఉన్న పంటలకు ఎలా వినియోగించాలని వివరించారు. కార్యక్రమంలో మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయండి


కృపాలక్ష్మి, జీడీనెల్లూరు, కన్వీనర్

కార్వేటినగరం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైభవంగా జరుపుకోవాలని గంగాధర నెల్లూరు నియోజకవర్గం పార్టీ కన్వీనర్ కళత్తూరు కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం పుత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్వీనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, జననేత జగనన్న జన్మదిన వేడుకలను ఆరు మండలాల్లో అత్యంత వైభవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో జరిగే జన్మదిన వేడుకలకు 9 గంటలకు ముఖ్య అతిథిగా హాజరవుతారని, అలాగే 10 గంటలకు శ్రీరంగరాజపురం,11 గంటలకు గంగాధర నెల్లూరు, మధ్యాహ్నం 12 గంటలకు పాలసముద్రం, ఒంటి గంటకు వెదురుకుప్పం మండలాల్లో జరిగే వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఆయా మండల కేంద్రాల్లో జరిగే జగనన్న జన్మదిన వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


పాలసముద్రం : మాజీ సీఎం జగనన్న జన్మదిన ఏర్పాట్లలో నాయకులు తులసీ, అన్బలగన్

ముందస్తుగా జగనన్న జన్మదిన సంబరాలు


కేక్ కట్ చేస్తున్న యువత, గ్రామస్తులు

వెదురుకుప్పం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ కోణంగిపల్లెలో ఘనంగా జరుపుకున్నారు. శనివారం పుట్టిన రోజు కాగా ముందుస్తుగా యువకులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పెద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం బాణసంచా కాల్చి సందడి చేశారు. జగనన్న నినాదంతో గ్రామం మారుమోగింది. కోలాట భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, యువజన విభాగం మాజీ మండల అధ్యక్షుడు బోడిరెడ్డి నరేష్‌రెడ్డి, కొమరగుంట సచివాలయ యువకులు ఈశ్వరరెడ్డి, జగదీశ్ రెడ్డి, రెడ్డయ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పం : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం వెదురుకుప్పంలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్ తెలిపారు.శనివారం ఉదయం 10 గంటలకు జరిగే వేడుకలకు మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నల్లవెంగనపల్లె పంచాయతీ చింతలగుంట ఎస్సీ కాలనీలో యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఏర్పాట్లు చేస్తున్నారు.

పాలసముద్రం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పండుగలా జరుపుకోవాలని మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలసి వారు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పుట్టిన రోజున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృపాలక్ష్మి పాల్గొంటారన్నారు. ఉదయం 11 గంటలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పించిన తరువాత కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, వైస్ ఎంపీపీలు, నాయకులు, వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.